సహకార సంఘాల సందర్శన

జగిత్యాల రూరల్/రాయికల్, జూలై 27: జగిత్యాల, రాయికల్ మండలం అల్లీపూర్ సహకార సంఘాలను శనివారం జిల్లా సహకార అధికారి రఘువరన్ సందర్శించారు. రుణమాఫీ ఖాతాలు, ఫర్టిలైజర్స్ స్టాక్స్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఆయా సహకార సంఘాల కార్యదర్శులు ఉపేందర్, గాజెంగి వేణు, అల్లీపూర్ సంఘం అధ్యక్షుడు రాజలింగం, అడ్మిషన్ అధికారి సాయికుమార్, సీఈవో ఉపేందర్‌రావు, రాజేశ్, మల్లేశం, నవీన్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం

జగిత్యాల రూరల్, జూలై 27: జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమలారాణి ఈనెల పదవీ విరమణ పొందనుండగా శనివారం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జక్కుల తిరుపతి, మండల విద్యాధికారి గాయత్రి, కాంప్లెక్స్ హెచ్ఎం విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

జగిత్యాల రూరల్, జూలై 27: జిల్లా కేంద్రంలోని కస్తూర్బాలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన చట్టాలు, కొత్త చట్టాలు, తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రత్యేకాధికారి గౌతమి, లీగల్ కౌన్సిలర్ లావణ్య, సాధికారత కేంద్రం సభ్యులు అశ్విని, గౌతమి, స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, జూలై 27: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున వైద్య, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. పెగడపల్లికి చెందిన కమలాకర్ డెంగ్యూతో బాధపడుతుండగా, శనివారం ఆయన వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కమలాకర్ కుటుంబసభ్యులతో పాటు చుట్టు పక్కల వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి నరేశ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్, జయశీల, శ్రీకాంత్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

జగిత్యాల, జూలై 27: తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి తఫజుల్ హుస్సేన్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తున్న కుమారులకు, కోడళ్లకు, మనుమలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్, ట్రిబ్యునల్ సహాయకురాలు పద్మజ, తదితరులున్నారు.

నగల దుకాణంలో చోరీ

రాయికల్, జూలై 27: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ నగల దుకాణంలోకి శనివారం రాత్రి బంగారం కొనుగోలు చేసేందుకు ఇద్దరు వచ్చారు. దుకాణా యజమాని ఉరుమండ్ల ప్రసాద్ బంగారం చూపించగా, అతనిపై మత్తు మందు చల్లగా స్పృహ తప్పి పడిపోయాడు. 25 గ్రాముల బంగారం, రూ. 15 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉరుమండ్ల ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

జగిత్యాల(మల్యాల), జూలై 27: మల్యాల ఎక్స్‌రోడ్డులో భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. ఎస్ఐ నరేశ్ కుమార్ శనివారం సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ సత్యప్రసాద్
- పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల సందర్శన
- విద్యార్థి మృతి ఘటనపై ఆరా
- పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని ఆగ్రహం

పాఠశాలలో విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, జూలై 27: గురుకుల పాఠశాలల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఇద్దరు అస్వస్థతకు గురైన ఘటనపై తోటి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులకు కిటికీలు లేకపోవడం, ఆవరణలో పారిశుధ్యంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి, ఇద్దరు విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ జరిపి, పూర్తి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వెల్లడైతే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, నూతన భవనం పనులు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల పరిశీలన

పెద్దాపూర్ గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వేర్వేరుగా పరిశీలించారు. జరిగిన ఘటనపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గురుకులంలో ఏమైనా సమస్యలుంటే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దృష్టికి తీసుకురావాలని విద్యాసాగర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు.

పాముకాటా.. విష పురుగా..!

- పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి ఘటనపై కొనసాగుతున్న ఉత్కంఠ
- అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులను నిమ్స్‌కు తరలించిన అధికారులు

అస్వస్థతకు గురైన విద్యార్థులను నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలిస్తున్న వైద్యాధికారులు

మెట్‌పల్లి రూరల్, జూలై 27: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి మృతి, ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గల కారణాలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. విద్యార్థులు పాముకాటుకు గురయ్యారా.. లేక విష పురుగు కుట్టిందా అన్న సందేహాలు నెలకొన్నాయి. గురుకుల పాఠశాలలోని రేకులషెడ్డు గదుల్లో నేలపై విద్యార్థులు నిద్రిస్తుండగా, శుక్రవారం తెల్లవారుజామున ఆరపేటకు చెందిన రాజారపు గణాధిత్య (13) మృతి చెందగా, మెట్‌పల్లికి చెందిన రాపర్తి హర్షవర్ధన్, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్‌కు చెందిన ఆడెపు గణేశ్ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ప్రిన్సిపాల్ ఇచ్చిన సమాచారంతో గణాధిత్యను తండ్రి మహేశ్ మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్దిసేపటికే మరో ఇద్దరు విద్యార్థులు హర్షవర్ధన్, గణేశ్ సైతం అస్వస్థతకు గురికాగా, పాఠశాల ఉపాధ్యాయులు, వాచ్‌మెన్ మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, ఈ విషయాన్ని సాయంత్రం దాకా గోప్యంగా ఉంచడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రథమ చికిత్స చేసిన మెట్‌పల్లి వైద్యులు విష పురుగు కుట్టినట్లు నిర్ధారించి, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు రెఫర్ చేశారు. కాగా, నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో గణేశ్‌ను చేర్పించగా, ఎడమ చేతిపై పాముకాటు వేసిందని వైద్యులు వెల్లడించారని కుటుంబ సభ్యులు తెలిపారు. హర్షవర్ధన్‌ను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా, శరీరంలో పాయిజన్ ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాస్, వైద్యాధికారులు నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు చేరుకొని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు.

పాఠశాలలో పాములు, ఎలుకల సంచారం

పాఠశాలలో గతంలో పాములు, ఎలుకలు సంచరించినట్లు పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. అలాగే, తరగతి గదులకు కిటికీలు, తలుపులు లేకపోవడం, ఆవరణలో పచ్చిగడ్డిని తొలగించకపోవడం పట్ల కలెక్టర్ సత్యప్రసాద్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల రక్షణలో ప్రిన్సిపాల్ పూర్తిగా నిర్లక్ష్యం వహించినట్లు తెలుస్తున్నది. దీంతో సుమారు 250 మంది విద్యార్థులను తల్లిదండ్రులు వారి ఇండ్లకు తీసుకెళ్లారు. కాగా, గణాధిత్యకు మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అయితే, తండ్రి మహేశ్ తన కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడని కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేకున్నా గణాధిత్య మృతదేహానికి ఎందుకు పోస్టుమార్టం నిర్వహించారన్న సందేహాలు సైతం నెలకొన్నాయి. ఏదేమైన పోస్టుమార్టం నివేదిక వస్తే విద్యార్థి మృతికి గల కారణాలపై స్పష్టత రానుంది.

స్వప్రయోజనాల కోసమే ఎమ్మెల్యే పార్టీ మార్పు

రాయికల్, జూలై 27: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సొంత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని, అభివృద్ధి కోసం కాదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. పట్టణంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాయికల్ పట్టణాభివృద్ధి కోసం మాజీ ఎంపీ కవిత రూ. 25 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఐదేళ్ల కాలంలో రాయికల్ మండల, పట్టణాభివృద్ధికి సీడీపీ నిధులు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల కాంతారావు, వల్లకొండ మహేశ్, శ్రీరాముల సువర్ణ–సత్యనారాయణ, మారంపెల్లి సాయికుమార్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు స్పందన, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదయశ్రీ, లావుడియా సురేందర్ నాయక్, దొంతి నాగరాజు, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాయికల్, జూలై 27: భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్, నాయకపు గూడెం, బోర్నపల్లి గ్రామాలను శనివారం ఆయన పరిశీలించారు. మత్స్యకారులు, పశువుల కాపరులు గోదావరి నదిలోకి వెళ్లవద్దని సూచించారు. అనంతరం రాయికల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

కోరుట్లలో ఇంటింటా జ్వర సర్వే

కోరుట్ల, జూలై 27: పట్టణంలోని 16వ వార్డులో వైద్య సిబ్బంది శనివారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఇక్కడ కౌన్సిలర్ బలిజ పద్మ, సూపర్‌వైజర్ ధనుంజయ్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, తదితరులున్నారు.

విద్యుత్ సిబ్బందికి అభినందన

జగిత్యాల, జూలై 27: ప్రజలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న అధికారులు, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించినట్లు జిల్లా విద్యుత్ అధికారి సత్యనారాయణ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శ్రీ చైతన్యలో గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం

జగిత్యాల టవర్ సర్కిల్, జూలై 27: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధురి, మహేందర్, ఇన్‌చార్జి పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలు

సారంగాపూర్, జూలై 27: రేచపల్లిలోని బెన్‌హిన్ పాఠశాలలో శనివారం ఆషాఢ మాసం సందర్భంగా బోనాల వేడకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమోల్, ఉపాధ్యాయులు స్నేహల్, భాగ్యలక్ష్మి, స్వరూపారాణి, వనిత, సునీత, సుదీన, వసంత, రమ్య, సహజ, సురేశ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్, జూలై 27: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలే శేఖర్, ప్రిన్సిపాల్ బాలె జయశ్రీ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్, జూలై 27: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బోనాలు, గోరింటాకు వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లి, జూలై 27: మేడిపల్లిలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, కొండాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బోనాలు, గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కుందారపు మహేందర్, డైరెక్టర్లు కుందారపు జితేందర్, నాగరాజు, గంగాధర్, హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయురాలు వినోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి, జూలై 27: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్, రెవెన్యూ, అత్యవసర విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సౌదీలో బీర్‌పూర్ వాసి అదృశ్యం

సారంగాపూర్, జూలై 27: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కందుల తిరుపతి(35) సౌదీలో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి 2022లో సౌదీకి వెళ్లి జిద్దలోని రెడ్‌మీ కంపెనీలో పని చేస్తున్నాడు. గత డిసెంబర్ 7న తమతో చివరి సారిగా ఫోన్‌లో మాట్లాడాడని, అప్పటి నుంచి ఆచూకీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తిరుపతి జాడ కనిపెట్టాలని కోరుతున్నారు.

హిందూ వాహినిలో యువకుల చేరిక

జగిత్యాల రూరల్, జూలై 27: జిల్లా కేంద్రంలో శనివారం హిందూ వాహిని సమావేశం నిర్వహించగా, తెలంగాణ సంఘటన్ ముడుపు యాది రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు యువకులు హిందూ వాహినిలో చేరారు. కార్యక్రమంలో హిందూ వాహిని బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ గ్రామాధ్యక్షుడిగా రాజ్‌కుమార్

మల్లాపూర్, జూలై 27: బీజేపీ మల్లాపూర్ గ్రామాధ్యక్షుడిగా ముష్కురి రాజ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి శనివారం నియామక పత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు యాదగిరి బాబు, నాగరాజు, లక్ష్మి, భూమేశ్, ప్రశాంత్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మేడిపల్లి, జూలై 27: మండల కేంద్రంతోపాటు కొండాపూర్, తదితర గ్రామాల్లో శానిటేషన్ పనులను శనివారం ఎంపీడీవో పద్మావతి పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో నీరజ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు అన్యాయం

జగిత్యాల టౌన్/మేడిపల్లి, జూలై 27: రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు అన్యాయం జరిగిందని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మొక్కుబడిగా లేఖలు రాస్తూ చేతులు దులుపుకొన్నాడని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 27: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువైంది. భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

రాయికల్, జూలై 27: రాయికల్ మండలం మహితాపూర్ గ్రామానికి చెందిన సద్ది హర్ష గ్రీవారెడ్డి నీట్‌లో ప్రతిభ కనబరిచాడు. 720 మార్కులకు గానూ 645 మార్కులు సాధించి, ఆల్ ఇండియా ర్యాంక్ 30432 సాధించాడు. ఈ సందర్భంగా హర్ష గ్రీవా రెడ్డికి తల్లిదండ్రులు, గ్రామస్తులు, నాయకులు అభినందనలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగికి సన్మానం

జగిత్యాల రూరల్, జూలై 27: జగిత్యాల అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి బదిలీపై మల్యాల వెళ్లగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, మాజీ ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. మాజీ ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో దయాకర్, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణ మాఫీ వెంటనే అమలు చేయాలి

కొడిమ్యాల, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా రుణ మాఫీ వెంటనే అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రేకుల పల్లి రవీందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, నాంపెల్లి రాజేశం, వడ్లకొండ బుచ్చిరాములు, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, అరుణ్‌కుమార్, కాయిత అంజయ్య, బండారి నరేశ్, మచ్చ రాజు, కొలకాని సాయిబాబు, అంజి, శంకర్, రమణాచారి, వెంకట్రావ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ'

కోరుట్ల, జూలై 27: పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఈకో – క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శిక్షా సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్‌రావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జయలక్ష్మి, గంగామోహన్, నాగరాజు, రవూఫ్, లక్ష్మి, వేణు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

కోరుట్ల, జూలై 27: పద్మశాలీ కులస్తులు పార్టీలకతీతంగా ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పద్మశాలీ కులోన్నతి సంఘ భవనంలో శనివారం సంఘం జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశం జరిగింది. నాయకులు వేముల బాలరాజ్, చందా మల్లయ్య, వెంకన్న, శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, జిల్లా ధనుంజయ్ పాల్గొన్నారు.

గోదావరికి పోటెత్తిన వరద

ధర్మపురి, జూలై 27: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శనివారం ధర్మపురి వద్ద గోదావరి స్నాన ఘట్టాలను ఆనుకొని ప్రవహించింది. భక్తులు లోతు ప్రాంతానికి వెళ్లకుండా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తం చేశారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE

★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.
NT-327686

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కేంద్రమంత్రిని కలిసిన నాయకులు

కథలాపూర్, జూలై 27: కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్‌లో జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు బాదినేని రాజేందర్ శనివారం కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందించి, శాలువాతో సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ప్రతినిధులు సుధాకర్, శంకర్, తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.

జగిత్యాల, జూలై 27: కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్‌ను శనివారం బీజేపీ మల్యాల మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సర్వాపూర్ ఎక్స్‌రోడ్డు, గుడిపేట మీదుగా కొండగట్టు కెనాల్ మోరి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్డు నిర్మాణం, మ్యాడంపల్లి నుంచి మానాల గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా, సానుకూలంగా స్పందించారు. అలాగే, మల్యాలలో నిర్మిస్తున్న పద్మశాలీ కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల మల్లేశం, నేరెళ్ల శ్రవణ్ కుమార్, నులిగొండ సురేశ్, పద్మశాలీ సంఘం సభ్యుడు బోడ గోవర్ధన్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

రాయికల్, జూలై 27: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడకుండా చేపట్టే చర్యలు, పారిశుధ్య పనులు, తదితర అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. 12వ వార్డులో రూ. 20 లక్షలతో స్లాబ్ కల్వర్టులు, డ్రైన్లు నిర్మించాలని తీర్మానం చేశారు. సమావేశంలో 18 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చైర్మన్ తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, మేనేజర్ వెంకటి, ఏఈ సీవీ ప్రసాద్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తడి దుంకుతున్న చెరువులు

మెట్‌పల్లి రూరల్/వెల్గటూర్, జూలై 27: మెట్‌పల్లి మండలం రంగారావుపేట పెద్దచెరువు, ఆత్మకూర్ పెద్దచెరువు, వేంపేట పెద్దచెరువు మత్తడి దుంకుతున్నాయి. పలు కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. కాగా, ఆత్మకూర్ పెద్దచెరువు మత్తడి దెబ్బతినగా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వెళ్లి పరిశీలించారు. మత్తడి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఇరిగేషన్ డీఈఈ అరుణోదయ్‌కు సూచించారు. అలాగే, వెల్గటూర్ పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం మత్తడి దుంకుతున్నది.

పీఆర్‌టీయూ